RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com


ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 347 పేజీలు - 08 గురువారం 06 నవంబర్ 2025

## మంత్రి పదవి ఆశించా!

### ప్రభుత్వ సలహాదారుగా సక్రమంగా బాధ్యతలు నిర్వర్తిస్తా

### బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబరు5:** మంత్రి పదవి ఆశించానని, కొన్ని సమీకరణాల వల్లే అది నెరవేరలేదని ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో బుధవారం ఉదయం ఆయన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన చాంబర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

## రేంవత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు

### బిజెపిలో త్వరలోనే బిఆర్‌ఎస్ విలీనం

### ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది

### గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబరు5:** బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. మిగతాది 2లో...



# భారత జట్టు అద్భుతమైన పునరాగమనం చేసింది.

### ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన ప్రపంచ కప్ గెలిచిన మహిళా క్రికెట్ జట్టు

### జట్టు సభ్యులకు తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి

### 'నమో' అని సంతకం చేసిన జెర్సీ ప్రధానికి బహూకరణ




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్5:** వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం తన నివాసంలో ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులను అభినందించారు. వరుసగా మూడు ఓటముల తర్వాత భారత జట్టు అద్భుతమైన పునరాగమనం చేసిందని ఆయన కొనియాడారు.మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు జట్టు సభ్యులు సాయంత్రం ప్రధాని నివాసానికి చేరుకున్నారు. ప్రపంచ కప్ విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'నమో' అని సంతకం చేసిన టీమిండియా జెర్సీని ప్రధానికి మహిళా జట్టు బహూకరించింది. 2017 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ చివరి వరకు పోరాడి ఓడింది. నాడు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలీ రాజ్ నేతృత్వంలోని భారత జట్టు ప్రధానిని కలిసింది. ఈ విషయాన్ని మోదీ గుర్తు చేసుకున్నారు. అనంతరం మోదీకి ప్రపంచ కప్‌ను అందించారు.



## తెలంగాణ సరిహద్దు సమీపంలో

# కాల్పుల మోత...

## ముగ్గురు మావోయిస్టుల మృతి

### ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

### కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి

### మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న బలగాలు

### జనవరి నుంచి ఇప్పటివరకు 477 మంది మావోయిస్టుల హతం

### ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబరు5:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుకు సమీపంలోని తార్లగూడ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. మిగతాది 2లో...

# బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం

### ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ స్కూల్ పిల్లలకు అండ

### టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్ణయం

### ఆయా జిల్లా కలెక్టర్లకు లేఖ ద్వారా వెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబరు5:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ శుభవార్త అందించారు. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135,మిగతాది 2లో...



# అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటి?

### హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు ఉండకూడదో చెప్పాలి

### నేను మొదట సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తినన్న రేవంత్ రెడ్డి

### మోదీ, కేసీఆర్ ఇద్దరూ ఒకటేనని విమర్శ

**తొలి అక్షరం/హైదరాబాద్, 5:** అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేటలో మిగతా2లో...



# బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

### భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం

### 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ ఓటింగ్

### ఉదయం 7నుంచి సాయంత్రి 6 వరకు పోలింగ్

**తొలి అక్షరం/పాట్నా,నవంబర్5:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరం కీలక ఘట్టానికి చేరుకుంది.

నేటి తొలివడత పోలింగ్‌కు ఇసి పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో కేటాయించిన పోలింగ్ కేంద్రాకు ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. రెండు విడతల పోలింగ్‌లో మిగతాది 2లో...




### ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ

# సమర్థిస్తున్నారా, వ్యతిరేకిస్తున్నారా?

### రాహుల్ గాంధీ ఓటు చోరీ విమర్శలు.. కౌంటర్ ఇచ్చిన ఎన్నికల సంఘం

### హర్యానాలో ఓటు చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపణలు

### హర్యానా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి అభ్యంతరాలు రాలేదని వెల్లడి




## దమ్ముంటే అభివృద్ధిపై

# చర్చిద్దాం..

### ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం

### సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబరు5:** హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే.. రేవంత్‌తో చర్చకు రెడీ అని ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు.మిగతాది 2లో...



# కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

### ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబరు5:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి మిగతాది 2లో...

# మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్సీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు.

అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణెళిష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,

తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం..

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. హోంశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేదెవరో ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ హయాంలో మంచినీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను మురికికూపంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలీడేలు విధించేవారని, కేసీఆర్ పాలనలో24గంటలు నాణ్యమైన కరెంట్ అందించామన్నారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీహిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు.

## కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

## తెలంగాణ సరిహద్దు సమీపంలో కాల్పుల మోత...

(మొదటి పేజీ తరువాయి)

వివరాల్లోకి వెళితే... అన్నారం, మరిమల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై అధికారికంగా పూర్తి ప్రకటన వెలువడాల్సి ఉంది. బుధవారం సాయంత్రం నాటికి కూడా ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. "బీజాపూర్ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది, పరిస్థితి సాధారణంగానే ఉంది. ఆపరేషన్‌కు సంబంధించిన కీలక వివరాలను తగిన సమయంలో అందిస్తాం" అని మధ్యాహ్నం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ ఘటనపై స్పందిస్తూ, హతమైన మావోయిస్టులు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పనిచేస్తున్న స్థానిక కమిటీలకు చెందినవారై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2024 జనవరిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1,785 మందిని అరెస్ట్ చేశారు. వివిధ ఆపరేషన్లలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకవైపు సైనిక చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు 'ఆత్మసమర్పణ్ ఏవం పునర్వాస్ నీతి 2025', 'నియాద్ నెల్ల నార్ యోజన' వంటి పథకాల ద్వారా లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వం ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

## అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. నియోజకవర్గంలో రూ. 400 కోట్లతో అభివృద్ధి పనులను చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ నగరంలో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. కిషన్ రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తాను మొదట సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తినని అన్నారు. కొడంగల్‌లో తాను మూడుసార్లు గెలవడంలో మైనారిటీల సహకారం ఉందని వెల్లడించారు.

ఇరవై నెలల కాంగ్రెస్ పాలనలో మైనారిటీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇద్దరూ ఒకటే అన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని అన్నారు. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటేనని అన్నారు.

## ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా, వ్యతిరేకిస్తున్నారా?

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్5:** ఓట్ల చోరీ అంశంపై 'హైడ్రోజన్ బాంబు' పేరిట కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిస్పందించింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, బ్రెజిల్ మోడల్‌కు కూడా ఇక్కడ ఓటు ఉందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఈసీ స్పందించింది.

రాహుల్ గాంధీ ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? చెప్పాలని ఈసీ ప్రశ్నించింది. గత ఏడాది హర్యానాలో ఎన్నికలు జరిగాయని, వాటికి ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపింది. పోలింగ్ స్టేషన్లలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

## భూపాలపల్లి జిల్లాలో భారీ సుడిగాలులు

### గాలుల బీభత్సానికి నేలకొరిగిన పంటలు



**తొలి అక్షరం/జయశంకర్ భూపాలపల్లి,నవంబర్5:** జిల్లాలో భారీ సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. పలిమెల మండలంలోని లెంకలగడ్డలో గోదావరి పరివాహక అటవీ ప్రాంతంలో సుడిగాలుల ఏర్పడడంతో భారీగా చెట్లు ,మిర్చి, పత్తి పంటలు నెలకొరిగాయి. గత సంవత్సరం సెప్టెంబర్ నుండి ఇప్పటి వరకు మూడు సార్లు ప్రకృతి విలయతాండవం చేయడం సంచలనంగా మారింది. అయితే గత సంవత్సరం సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతంలో బీభత్సం చోటు చేసుకోగా తాజాగా లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో ప్రళయం సంభవించడం గమనార్హం. మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల మధ్య ఏర్పడిన వాటర్ స్పౌట్ ఉత్తర దిశ నుండి దక్షిణం వైపు ప్రయాణం చేసింది.దాదాపు 60 మీటర్ల వెడల్పుతో 3 కిలో మీటర్ల పొడవున సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. అయితే లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో వచ్చిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల కొంతమంది రైతులు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. వ్యవసాయ అవసరాల కోసం మోటార్లను తరలిస్తున్న ఎద్దుల బండి కూడా సుడిగాలుల ఉధృతికి కొట్టుకపోయింది. దీంతో ఎడ్ల బండిలో తీసుకెల్తున్న వ్యవసాయ పనిముట్లన్ని తునాతునకలు అయ్యాయి.. వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయిన కొంతమంది రైతులు వాటర్ స్పౌట్ కారణంగా పలుమార్లు గాల్లోకి లేవగా గురుత్వాకర్షణ శక్తి వల్ల తిరిగి నేలపై పడిపోయారు.ఇక్కడే ఉన్నట్టయితే ప్రాణాలు పోయేలా ఉందని గమనించిన రైతులు రాత్రి వరకూ ఇండ్లకు చేరుకుని భిక్కుభిక్కుమంటూ కాలం వెల్లదీశారు. లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో సంభవించిన వాటర్ స్పౌట్ ప్రభావంతో సుమారు 200 చిన్న,పెద్ద చెట్లు నేలకొరిగాయని తెలిపారు. లెంకలగడ్డ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లోని 10 ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలు కూడా నాశనం అయ్యాయి.

## బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా తొలి విడత పోలింగ్ 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో గురువారం జరుగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలతో ముగుస్తుంది. కొన్ని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం ముందస్తు జాగ్రత్తగా సాయంత్రం 5 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. తొలి విడత పోలింగ్ జరుగనున్న నియోజకవర్గాల్లో అందరి దృష్టి ప్రధానంగా వైశాలి జిల్లాలోని రఘోపూర్ అసెంబ్లీ నియోజకవర్గంపై ఉంది. ఇక్కడి నుంచి ఆర్జేడీ నుంచి 'మహాగఠ్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్నారు. రెండు సార్లు వరుసగా రఘోపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన హ్యాట్రిక్ విజయం కోసం బరిలో ఉన్నారు. గతంలో ఆ నియోజకర్గానికి తేజస్వి తండ్రి లాలూప్రసాద్ యాదవ్ రెండుసార్లు, తల్లి రబ్రీదేవి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరూ రఘోపూర్ నుంచి గెలిచే ముఖ్యమంత్రులు అయ్యారు. మహూవా నియోజకవర్గం కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా ఏర్పాటు చేసిన 'జన్‌శక్తి జనతా దళ్' నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఏడాది మొదట్లో ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ బహిష్కరణకు గురయ్యారు. ఇటీవల జన్‌సురాజ్ కార్యకర్త దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన మొకామా నియోజకవర్గంలోనూ ఓటర్లు ఎవరికి పట్టం కడతారనే ఆసక్తి నెలకొంది. ఈ హత్య కేసులో అరెస్టయిన అనంత్ సింగ్ మొకామా నుంచి జేడీయూ టిక్కెట్‌పై పోటీలో ఉన్నారు. ఆయన తరఫున కేంద్ర మంత్రి లలన్ సింగ్ ప్రచారం చేశారు. కాగా, గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తారాపూర్ నియోజకవర్గంపైనా ఆసక్తి నెలకొంది. ఇక్కడి నుంచి ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి పోటీలో ఉన్నారు. గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తొలి విడత ఎన్నికల్లో 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 3.75 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 50,000కు పైగా పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మహిళల కోసం 1,000కు పైగా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసింది. ఓటర్ ఐడీ కార్డు లేకపోతే ఆధార్, పాన్, పెన్షన్ కార్డు, డ్రైవర్ లైసెన్స్ వంటి 11 పత్రాలు ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. భద్రత కోసం పోలీసులు, కేంద్ర బలగాలతో కలిపి 50,000 వేల మందిని మోహరించింది. డ్రోన్లు, సీసీటీవీల పర్యవేక్షణలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల పోరు ప్రధానంగా ఎన్డీయే, ఇండియా కూటమి మధ్యనే ఉంటుందనే అంచనా ఉండగా, ప్రశాంత్ కిషోర్ జన్‌సురాజ్ పార్టీ కూడా అన్ని స్థానాల్లోనూ పోటీకి దిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 8 సభల్లో పాల్గొనగా, రాహుల్ 14 సభల్లో, నితీష్ 41 సభల్లో, తేజస్వి అత్యధికంగా 96 సభల్లో పాల్గొన్నారు. కాగా, రెండో విడత పోలింగ్ 122 నియోజకవర్గాల్లో నవంబర్ 11న జరుగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

## బండి సంజయ్ మరో సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజ కవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించు కున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయిం చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి 'మోడీ గిఫ్ట్' పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటిం చారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభం లోనే 'మోడీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయబోతున్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

• తొర్రూర్ ఎంఈఓ బుచ్చయ్య



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 5:** ప్రతి విద్యార్థి తరగతి స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తొర్రూరు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు.జనవిజ్ఞాన వేదిక మండల కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక మండల శాఖ గౌరవ జిల్లా ఉపాధ్యక్షులు రాయిపల్లి యాకయ్య సమన్వయంతో చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడపత్రికను బుధవారం జిల్లా పరిషత్ హై స్కూల్ లో వివిధ పాఠశాలల హెచ్ఎంలు జెల్లా లక్ష్మీ నారాయణ,తండ ప్రభాకర్, కొలుపుల వీరన్న తో కలిసి ఆవిష్కరించారుఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులలో పరిశీలన, ప్రశ్న,అధ్యయనం, హేతుబద్ధ ఆలోచనలు, వివేచన విచక్షణ శక్తి,పరిశోధన శక్తి,మరియు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చెకుముకి పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ జనవిజ్ఞాన వేదిక ద్వారా వెలువడేటువంటి చెకుముకి పత్రికను చదివి శాస్త్రీయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలన్నారు. 8,9,10వ తరగతి విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.తొర్రూరు మండల అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్ మాట్లాడుతూ... జన విజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్ ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించడానికి విశేషంగా కృషి చేస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి బుచ్చయ్య చెప్పినట్లుగా పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో సైన్సు పై అవగాహన పెంపొందించడానికి పత్రికను అన్ని పాఠశాలలో విద్యార్థుల చేత చదివించడానికి మా సభ్యులందరికీ సహకారంతో ముందుకు పోతామని అన్నారు ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ చెకుముకి పరీక్ష పాఠశాల స్థాయిలో నవంబర్ 7, మండల స్థాయిలో నవంబర్ 21, జిల్లాస్థాయిలో నవంబర్ 28న, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12,13,14 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ గోడ పత్రిక ఆవిష్కరణలో జెవివి ప్రధాన కార్యదర్శి కోటగిరి కుమార్ కోశాధికారి ఎద్దు వెంకన్న, చెకుముకి కన్వీనర్ పులి ముత్తిలింగం జెవివి బాధ్యులు చంద్రమౌళి,ఎర్ర పూర్ణచందర్,దుబ్బాక శ్రీధర్ రెడ్డి,పెరుమాండ్ల రమేష్,సూరం ఉపేందర్ రెడ్డి,ఆనంతరెడ్డి,కొమ్మనబోయిన వెంకన్న,విజయ్,గుర్రం సుమన్,పండరీ, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



**తొలి అక్షరం/గణపురం:** మండలంలోని చెల్పూర్ గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తి ప్రబోధక వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే భక్తజనం దేవస్థానానికి తరలివచ్చి, స్వామివారి అనుగ్రహం కోసం పూజలు, వ్రతాలు, హారతులు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ హనుమంత రావు, వేదపండితులు ఆకాష్ శుక్ల ఆధ్వర్యంలో వ్రత మహోత్సవం విజయవంతంగా పూర్తయింది. వేద మంత్రములు, శ్లోకాల మధ్య భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని భక్తి భావంతో వ్రత మహోత్యాన్ని ఆస్వాదించారు. వేదపండితులు పాల్గొన్న ప్రతి కుటుంబానికీ ఆశీర్వచనములు అందించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాధవరావు, పున్నం చందర్, నవీన్ రావు, గట్టు సాయి, దేవునూరి రాజు, తిరుపతి రావు, చందా అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 9న శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

• ఆలయ ప్రాంగణంలో కళ్యాణ పత్రిక ఆవిష్కరణ





**తొలి అక్షరం/గణపురం:** మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయం రెడ్డిగుడిలో ఈ నెల 9న శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ నిర్వహకులు, గ్రామ పెద్దల సమక్షంలో కళ్యాణ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ఘనంగా కళ్యాణోత్సవం జరగనున్నదని, భక్తులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. 9వ తేది సాయంత్రం 6 గంటలకు మోటాపోతుల రవీందర్ సరిత దంపతులచే కళ్యాణం ప్రారంభమవుతుందని, కళ్యాణ మహోత్సవం అనంతరం మహా అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. అలాగే 10వ తేదీన స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో భక్తుల నడుమ ఊరేగింపుగా తిరుగుతాయని ఆలయ నిర్వాహకులు వివరించారు. కావున మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికాలని కోరారు. భక్తులు, గ్రామస్తులు అందరూ ఈ పవిత్ర ఉత్సవాలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆలయ పరిసరాల్లో పూలతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు సురేష్, మోటపోతుల రాజన్న మోటపోతుల సురేందర్ తాళ్లపల్లి గోవర్ధన్, మాజీ ఎంపిటిసి మోటాపోతుల శివశంకర్ గౌడ్, మార్క మొగిలి గౌడ్, మార్క రవి గౌడ్, చిర్ర మధు ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు

# లంచగొండి డీటీని డిస్మిస్ చేయాలి

- ఇప్పటివరకు ఇష్యూ చేసిన రికార్డులపై విచారణ చేపట్టాలి
- రెవెన్యూ శాఖను కరప్షన్ శాఖగా మార్చిన ఉద్యోగులను ఏరివేయాలి
- డీటిపై చర్యలు తీసుకోకపోతే ఎమ్మార్వో ఆఫీస్ ని ముట్టడిస్తాం
- బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి



**తొలి అక్షరం/కొందుర్గు,నవంబర్ 05:** కొందుర్గు తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్గా విధులు నిర్వహిస్తున్న రాకేష్ కుమార్ పై వస్తున్న అవినీతి ఆరోపణలను విచారించి వెంటనే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలకు నిస్వార్ధంగా సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు లంచాలకు మరిగి రికార్డులను మార్చుతూ అవినీతికి పాల్పడడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకుని దానికనుగుణంగా సంబంధిత రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ డబ్బులు ఇస్తే తప్ప రికార్డులు సరి చేయని పరిస్థితి దాపురించిందని అన్నారు. గత అనేక రోజులుగా డిటిపై అవినీతి ఆరోపణలు వస్తున్నా రెవెన్యూ ఉన్నతాధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం పట్ల వారి పాత్ర కూడా ఉందేమో అనే సందేహం ఉంది అన్నారు. రెవెన్యూ శాఖను కరప్షన్ శాఖగా మార్చిన ఉద్యోగులను ఏరివేయాలని డిమాండ్ చేశారు. రైతుల రక్తం తాగుతున్న రక్తపిశాచాల మాదిరి రెవెన్యూ యంత్రాంగం తయారయిందని అన్నారు. డిటి రాకేష్ కుమార్ పై చర్యలు తీసుకోకపోతే ఎమ్మార్వో ఆఫీస్ ని ముట్టడిస్తామని, తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ముందుస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

**అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్**





**తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 05:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదలలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాలను ముట్టడించేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, చౌదరిగూడా పోలీసులు విద్యార్థి నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు.అరెస్టయిన వారిలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్, ప్రకాష్, శ్రీను, అరుణ్, వినోద్ ఉన్నారు. నిరసనకు సిద్ధమవుతున్న నాయకులను ఆకస్మికంగా అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.విద్యార్థులు శాంతియుతంగా తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలనుకున్నప్పటికీ, పోలీసులు ముందుగానే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని విద్యార్థి సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. ఏఐఎస్ఎఫ్ నేతలు మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల తో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి. నిరసనలను అణగదొక్కడానికి ప్రయత్నిస్తే పోరాటం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు.

# దళిత,గిరిజన కాలనీల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

**- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాద్,ఉపాధ్యక్షులు పి.సత్యనారాయణ**



**తొలి అక్షరం/ఏన్కూర్,నవంబర్5:** ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలోని పలు దళిత, గిరిజన కాలనీలు,తండాలలో నెలకొన్న తీవ్రమైన మౌలిక వసతుల కొరతపై కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్,ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణలు ప్రభుత్వని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మండలంలో అనేక దళిత ,గిరిజన కాలనీలలో వర్షాల వల్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని ఏరియాలకి మంచినీటి సౌకర్యాలు లేవని కొన్ని రహదారులు పాడైపోయినాయని కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని పేర్కొన్నారు.కావున అధికార సిబ్బంది వెంటనే జోక్యం చేసుకొని కాలనీలలో తండాలలో సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రభుత్వనీ కోరారు.స్వాతంత్రం వచ్చి 78 వసంతాలు పూర్తయినా మౌలిక వసతులు కల్పించలేని దుర్భర పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు వెంటనే జోక్యం చేసుకోని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు,అర్హులైన వారందరికి ఉపాధి కల్పించాలని రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడాలని, గ్రామాలలో వివక్షత కొనసాగుతుందని వీటిని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.రాబోయే రోజులలో సమావేశం నిర్వహించి వీటిపై తగు కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దళిత,గిరిజన బహుజనులు ఏకమై సమస్యలపై ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.రాజ్యాంగం స్వాతంత్రం ఫలాలు స్వేచ్ఛ సమానత్వం సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందు,లక్ష్మణ్,వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# గురువారం నిర్వహించే గ్రీవెన్స్, ఉద్యోగవాణి కార్యక్రమం యధాతధం

• తెలిపిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా బుధవారం రోజున కలెక్టర్ ఎం హనుమంతరావు గురువారం నిర్వహించే గ్రీవెన్స్, ఉద్యోగవాణి కార్యక్రమం యధాతధంగా ఉంటుందని ఒక ప్రకటనలో తెలిపారు.తేది:06.11.2025న గురువారం నిర్వహించే గ్రీవెన్స్, ఉద్యోగవాణి కార్యక్రమం యధావిధిగా ఉంటుందని ప్రజలు, ఉద్యోగులు వారి యొక్క సమస్యలపై దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.కావున జిల్లాలోని ప్రజలు కలెక్టరేట్ కు వచ్చి ఫిర్యాదులు ఇవ్వవచ్చని కలెక్టర్ అన్నారు.

# దేవగిరి పట్నం: అడవి పందుల దాడిలో రైతు మృతి



**తొలి అక్షరం/ములుగు నవంబర్ 05:** అడవి పందుల దాడిలో రైతు మృతి చెందిన ఘటన ములుగు మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన కుందురు వెంకటేశ్వర రెడ్డి (65) ఉదయం తన పంట పొలం వద్దకు వెళ్లాడు. పంట పరిశీలిస్తుండగా హఠాత్తుగా అడవి పందులు దాడి చేశాయి. ఈ దాడిలో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ములుగు ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# కోటగుళ్ళు గణపేశ్వరాలయానికి నూనె వితరణ



**తొలి అక్షరం/గణపురం:05:** కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయము కోట గుళ్ళు కు దీపోత్సవానికై 25 లీటర్ల నూనెను గణపురం గ్రామానికి చెందినటువంటి మూల రఘు స్వప్న దంపతులు స్వామివారికి అందించడం జరిగింది అనంతరం అర్చకులు జూపల్లి నాగరాజు ఆ దంపతులిద్దరికీ తీర్థ ప్రసాదాలు ఆశీర్వచనాలు అందజేశారు

# నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్

**- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో నేతల సమావేశం**






**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05:** సాయంత్రం సీఎం రోడ్ షో ఏర్పాటు పై సమీక్షించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ బుధవారం సాయంత్రం యూసుఫ్ గూడ డివిజన్, కృష్ణానగర్, బి బ్లాక్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్ సందర్భంగా ఏర్పాటు పై స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, ఆదిల్ హైమత్, మున్నా బాబా అన్వర్,కృష్ణ,మహేందర్,మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా దీపావళి సమ్మేళనం కార్యక్రమం

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ స్వర్ణగిరి పుణ్యక్షేత్రం సమీపంలో ప్రతి యేటా నిర్వహించే దసరా దీపావళి సమ్మేళనం కార్యక్రమం ఈ సంవత్సరం స్వర్ణగిరి ఆవరణలో చేయడానికి రాష్ట్ర కురుమ సంఘం నిర్ణయించడం జరిగింది. రాష్ట్ర కురుమ సంఘం ఆద్వర్యంలో బుధవారం రోజు స్థల పరిశీలన మరియు ఏర్పాట్లను పర్యవేక్షించిన రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేషం,భువనగిరి పార్లమెంటు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ మరియు కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## శివయ్య నామస్మరణతో మారుమోగిన ఆలయాలు

**- ఆలయాల వద్ద కార్తీకదీపాలు వెలిగించిన మహిళలు**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం బుధవారం రోజున కార్తీక పౌర్ణమి సందర్భంగా మూసీనదిలో ఉన్న భీమ లింగేశ్వర దేవస్థానంలో శివయ్యను మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల భక్తులు శివయ్యను దర్శించుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు.ఉదయం లేవగానే స్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లారు.కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సాయంత్రం ఆరుబయట దీపాలు వెలిగిస్తారు.అత్యంత పవిత్రమైన రోజున నియమ నిష్టలతో ఉపవాసాలు ఉండి నోములు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తారు.సంగెం గ్రామంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచి మాజీ ఉపసర్పంచ్ భక్తులు పాల్గొనడం జరిగింది. మండలం మొత్తం శివయ్య నామస్మరణతో మారుమోగింది.

## కొలనుపాకలోని సోమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

**- నిర్వహించిన బిఆర్ఎస్ మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా బుధవారం రోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ కొలనుపాకలోని సోమేశ్వరాలయంలో శివలింగంని దర్శించుకుని అందరూ బాగుండాలని కోరుకున్నానని ఆత్మకూరు(ఎం)మండలం బిఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్ రెడ్డి పత్రికల వారితో మాట్లాడుతూ తెలిపారు.

## బీర్ల ఫౌండేషన్ చైర్పర్సన్‌కు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు

**- తెలిపిన శివాజీ యువజన మండలి అధ్యక్షులు మజ్జిగ నరేష్**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి ఆత్మకూరు(ఎం)మండలం బుధవారం రోజున శివాజీ యువజన మండలి అధ్యక్షులు మజ్జిగ నరేష్, సభ్యులు మజ్జిగ శ్రీశైలంలు కార్తీక పౌర్ణమి పండుగ సందర్భంగా హైదరాబాదు లో బీర్ల ఫౌండేషన్ చైర్పర్సన్ బీర్ల అనిత ఐలయ్యనీ వారి నివాసంలో కలిసి కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అనంత స్వర్ణగిరిలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామం మరియు నార్కెట్ పల్లి మండలంలోని తుమ్మలగూడెం,మాండ్ర గ్రామాల పరిధిలో ఉన్న అనంత స్వర్ణగిరి శ్రీ పఠాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామీ వ్రతం , మరియు శ్రీ పట్టాభి సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అనంతరం మహాలక్ష్మి అమ్మవారి కొలనులో కార్తీక దీపాలు వెలిగించడం జరిగింది.దాదాపు 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది.అనంతరం శ్రీరామదాసు సేవాసమితి అధ్యక్షులు ఉంద్రా లింగారెడ్డి బాగ్యమ్మ మాట్లాడుతూ మూడు గ్రామాల మధ్య వెలిసిన శ్రీ పట్టాభి రామచంద్ర స్వామి దేవాలయము ఎంతో పవిత్రమైనదని శ్రీ మహాలక్ష్మి , శ్రీ మహాభిరామచంద్రస్వామి దేవాలయ పుణ్యక్షేత్రాన్ని చూడడానికి విదేశాల నుండి కూడా వస్తున్నారని,ప్రజలందరూ మనశ్శాంతి కోసం ప్రకృతిలో ప్రశాంతంగా ఉన్న దేవాలయం ఇదేనని అనేక గ్రామాల నుండి వస్తున్నారని నిత్యం దైవ దర్శనం , అర్చనలు ప్రతినెల అమ్మవారికి , పట్టాభి సీతారామచంద్రస్వామి మాస కల్యాణం ప్రతినెల నిర్వహించడం జరుగుతుందని మహాలక్ష్మి అమ్మవారి,పట్టాభి సీతారామచంద్రస్వామిల ఆశీస్సులు ఎల్లపుడూ ప్రజలు పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు ఉత్తరపల్లి నరసింహచార్యులు,మనీ,యాట వెంకన్న,మదూరి జమున కిషన్ రావు,సామజిక కార్యకర్త వేముల సైదులు,కొనతం కృష్ణారెడ్డి,అవుల సైదులు,జానయ్య,దంతూరి లింగయ్య,చిల్లా సునీత సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని 518 దీపాలతో శివలింగం అలంకరణ



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మంగళవారం రోజున ఆవుపేడతో తయారుచేసిన శివలింగానికి బుధవారం రోజున ఉదయం ఐదు గంటల 18 నిమిషాలకు 518 దీపాలతో 518 బిల్వపత్రాలతో శివలింగానికి పూజ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో అర్చకులు పార్నంది లక్ష్మణమూర్తి శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించినారు. ఈ పూజా కార్యక్రమంలో పద్మశాలి సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య,పద్మశాలి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గుండు ప్రసాద్, మెట్టు మంగేష్ దంపతులు,పాదం కిరణ్ కుమార్ దంపతులు,డాక్టర్ నామా నరసింగరావు దంపతులు, బలిజ శివ బంధారపు శేఖర్ దంపతులు,బైరు యాక స్వామి దంపతులు,ముదిరాజ్ సంఘం నాయకులు సత్యనారాయణ, తదితర భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమం తదనంతరం తీర్థప్రసాదాలు అందజేసినారు.

## లక్ష యాబైవేల ట్రాక్టర్లు అమ్మిన సందర్భంగా యాదాద్రి దేవస్థానానికి 5042డి ట్రాక్టర్, ట్రాలీ అందజేత

**- తెలంగాణ జాన్ డియర్ డీలర్స్**






**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి కార్తిక పౌన్నమి రోజు వరకు లక్ష యాబై వేల ట్రాక్టర్లు అమ్మిన సందర్భంగా బుధవారం రోజు ఉదయం తెలంగాణ జాన్ డియర్ డీలర్స్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంనకు పి.ఎస్.శేఖర్, వి.రాజేంద్ర ప్రసాద్,పి.రాజేష్ యాదవ్,జి.గోపాల్ రెడ్డి, కె.ఏ.ఆన్సన్ ఎన్.రాజేశం, కె.సుదర్శన్ రెడ్డి,మొత్తం ఏడుగురి డీలర్స్ సహకారంతో 11,50,000/- రూపాయల విలువ గల జాన్ డియర్ ట్రాక్టర్ మరియు ట్రాలీ కలిపి ట్రాక్టర్ ని విరాళంగా దేవస్థానం ఇంచార్జ్ ఈఓ రవి (ఐఏఎస్)కు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాన్ డియర్ ట్రాక్టర్ డీలర్లు,ఆలయ అర్చకులు,ఆలయ అధికారులు, టాక్టర్స్ మేనేజర్,తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి శోభ







**తొలి అక్షరం/ములుగు నవంబర్ 05:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల ప్రపంచ వారసత్వ సంపద రామప్ప రామలింగేశ్వర్ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో ఉదయం నుంచే స్వామివారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 365 వత్తులను వెలిగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు శైవ క్షేత్రాలన్నింటిలో కూడా కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో రామప్ప దేవాలయంలో భక్తులతో కార్తీక పౌర్ణమి శోభా నెలకొని ఉంది

## కార్మిక వర్గ హక్కులను కాలరాస్తు కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న నరేంద్ర మోడీ

**● సిఐటియు జిల్లా నాయకులు మొరిగాడి రమేష్**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** సంపద సృష్టికర్తలైన కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న నరేంద్ర మోడీ విధానాలను ఎండగట్టాలని సిఐటియు జిల్లా నాయకులు మోరిగాడి రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. మండలంలోని గొలనుకొండ గ్రామంలో మంగళవారం రోజున గ్రామీణ హమాలీ కార్మికులతో సిఐటియు జిల్లా మహాసభల కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వం నుండి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఆయన అన్నారు. కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసే హక్కును సమ్మెహక్కును ప్రశ్నార్థకం చేస్తూ కార్మికులు ఎనిమిది గంటల శ్రమ కాలాన్ని 12 గంటలకు పెంచుతూ కార్మికులకు నష్టం చేసే అనేక అంశాలను లేబర్ కోడుల ద్వారా తీసుకువచ్చి కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టివెసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం డాక్టర్ ఆండ్రాయిడ్ ఫార్ములా ప్రకారం కార్మికుడు రోజువారీగా 2700 క్యాలరీలు,65 గ్రాముల ప్రోటీన్ ఇచ్చే పాలు గుడ్లు,మాంసం తీసుకోవాలని సూచిస్తుంటే మరోవైపు కార్మికున్ని రోజువారి వేతనం రూపాయలు 178 రూపాయలు కనీస వేతనంగా నిర్ధారిస్తూ నేషనల్ ఫ్లోర్ లెవెల్ మినియం వేజ్ కమిటీ ప్రకటించింది.ఈ రూపాయలు 178తో పౌష్టికాహారం ఏ విధంగా కొనగలరో చెప్పాలని నరేంద్ర మోడీని ప్రశ్నించారు.అదేవిధంగా 2012 నుండి నేటి వరకు తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు ప్రభుత్వాలు పెంచడం లేదు.ఈ పరిస్థితులలో కార్మిక వర్గ పోరాటాలు పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి అని ఆయన అన్నారు.ఈ నేపాధ్యంలో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాల రూపకల్పన చేయడం కోసం గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు ఈ మహాసభలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. అందులో భాగంగా రామన్నపేటలో జరిగే యాదాద్రి భువనగిరి జిల్లా నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులు సహకరించవలసిందిగా కార్మికులను ఆయన కోరుతున్నానని అన్నారు.సిఐటియు నాయకులు వడ్డేమాన్ బాలరాజ్, సిఐటియు మండల కన్వీనర్ సంఘీ రాజు,మద్దే బోయిన ఉప్పలయ్య,బైరపాక అశోక్, కట్కూరి బాలరాజు,కట్కూరి ఆంజనేయులు,కట్కూరి స్వామి, మద్దేబోయిన శివ,పెండాల నరసయ్య,తాండ్రు దేవ స్వామి, బాకీ ఎల్లయ్య,బైరపాక రమేష్, కొడిదల ఉమేష్,బైరపాక వెంకటేష్,నకరకంటి రాంనర్సయ్య,బలంతుల శ్రీకాంత్, రహీ పాల్గొన్నారు.

## పత్తాలేని స్థానిక ఎమ్మెల్యే

**● బిఆర్ఎస్ నాయకులు కర్రె చంద్రశేఖర్,ఓరిగంటి శ్రీధర్ చారి**






**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో అకాల వర్షాలతో ఆగమైన రైతంగాన్ని కనీసం పరామర్శించడానికి కూడా రాలేని స్థితిలో ఆలేరు ఎమ్మెల్యే. పంట చేతికి వచ్చే సమయంలో ఇటీవల కురిసిన వర్షాలతో పంటచేను దెబ్బతినడంతో పంటపై పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా పోయిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో స్థానిక ఎమ్మెల్యే రైతులకు అండగా ఉండాల్సిన సమయంలో అసలు తమ నియోజకవర్గంలోనే లేకుండా పోవడం విడ్డూరం.ఈ ప్రభుత్వానికి ఎందుకు రైతులపై కక్ష సాధింపు.? ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకొని ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించి , తడిసిన ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేయాలని అదేవిధంగా మల్లాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షం నీరు ఆగిఉన్న వాటిలలో మట్టిపోసి రైతులకు వరిధాన్యం ఆరబెట్టుకోవడానికి వసతులు కల్పించాలని రైతాంగం పక్షాన బీఆర్ఎస్ నాయకులు కర్రె చంద్రశేఖర్, ఓరిగంటి శ్రీధర్ చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పత్తి రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదు

**● కొర్రీలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి**

**● బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం**





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5:** రామన్నపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పత్తి పంట సాగు చేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి పకృతి వాతావరణం సహకరించక నెల రోజుల నుండి ఎడతెరిపిలేని వర్షాలకు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది ఇప్పటికే పత్తి సాగుకు పెట్టుబడి పెరిగి కూలీలు దొరకక నిండా మునిగిన రైతులకుతాజాగా ప్రభుత్వాలు తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో స్లాట్ విధానంలో పత్తి అమ్మకానికి ముందే స్లాట్ బుక్ చేసుకోవడం ఓటీపీ సమస్యలు ఒక ఎకరంకు 7 ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని మాత్రమే కొనుగోలు చేస్తామని తేమశాతం 8 నుండి 12 శాతం వరకు ఉంటే మాత్రమే దిగుబడి చేసుకుంటామని పత్తి కేంద్రం వద్ద అధికారులు చెప్పుతుండడంతో తేమ శాతం ఎక్కువ రావడం వల్ల పత్తి కొనుగోలు చేయడం లేదు ఏమి చేయాలో అర్థం కాక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో దళారుల వద్ద తక్కువ ధరలకు క్వింటాకు5000 నుండి6000 అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది కావున రైతులుగత సంవత్సరం మాదిరిగానే రైతులకు ఎకరంకు 12 క్వింటాళ్ల పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని తేమ శాతం ఎక్కువగా ఉన్న కొనుగోలు చేయాలని పత్తి అమ్మకానికి స్లాట్ విధానాన్ని రద్దు చేసి రైతు ఇష్టమున్న కాటన్ మిల్లు వద్ద పత్తి అమ్ముకోవడానికి అవకాశం కల్పియాలని ఈ సంవత్సరం తీసుకొచ్చిన కొత్త నిబంధనలను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాలను కోరడం జరిగింది.

# కళలు మన వారసత్వ సంపద

● వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ.టీ.వి. రంగయ్య





**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05:** మహబూబ్‌నగర్ టౌన్‌హాల్‌లో మిత్ర కళా నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి నాటక, సంగీత, నృత్య ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ సాంస్కృతిక మహోత్సవం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది.ఈ కార్యక్రమాలకు విశిష్ట అతిథిగా హాజరైన సంస్కార భారతీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు శ్రీ టీ.వి. రంగయ్య మాట్లాడుతూ...సాంప్రదాయ కళలు మన జాతి యొక్క వారసత్వ సంపద.సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం వంటివి మన సంస్కృతికి పునాది. వీటిని పరిరక్షించి, మన పిల్లలకు వారసత్వంగా అందించడం మన బాధ్యత అని అన్నారు.షాద్‌నగర్ సంస్కార భారతీ చిన్నారులు శ్రీ టీ.వి. రంగయ్య రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన మాకూ స్వాతంత్ర్యం కావాలి అనే బాలనాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.ప్రతి పాత్రను పిల్లలు అద్భుతంగా పోషించి చప్పట్ల వర్షం కురిపించారు. ఈ నాటికలో పి. వర్షిణి, వేదశ్రీ, యస్విత, యోషిత, సింధు, బిందు వైష్ణవి తదితర చిన్నారులు పాల్గొన్నారు.అదే విధంగా శివ మాస్టర్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు సభలోని వారిని అలరించాయి.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు చిన్నారులను అభినందించి ప్రశంసలతో ముంచెత్తారు.మహబూబ్‌నగర్ మట్టిలో పుట్టిన కళల పట్ల ఆత్మీయతను చూపుతూ, కొత్త తరం కళాకారులకు వేదిక కల్పించిన మిత్ర కళా నాట్య మండలి కృషిని అందరూ అభినందించారు.వారిలో శ్రీ బాడ్మి శివకుమార్, తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శ్రీ చంద్ర మౌళి, మాజీ ఎం.ఆర్.ఓ. శ్రీ జగపతి రావు, మాజీ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీ మిత్ర, కళా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి శ్రీ నారాయణ, మాజీ ఎం.పి.డి.ఓ. శ్రీ ప్రభాకర్ చారి, విశ్రాంత ఫారెస్ట్ ఆఫీసర్, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

# అనంత స్వర్ణ గిరిలో..కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం...

- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు...





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5:** రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామ తుమ్మలగూడెం , మాంద్ర గ్రామాల పరిధిలో ఉన్న అనంత స్వర్ణ గిరి శ్రీ పఠాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామీ వ్రతం , శ్రీ పట్టాభి సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అనంతరం మహాలక్ష్మి అమ్మవారి కొలనులో కార్తీక దీపాలు నిర్మించడం జరిగింది.. దాదాపు 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది.అనంతరం శ్రీరామదాసు సేవాసమితి అధ్యక్షులు ఉండ్రా లింగారెడ్డి బాగ్యమ్మ మాట్లాడుతూ మూడు గ్రామాల మధ్య వెలిసిన శ్రీ పట్టాభి రామచంద్ర స్వామి దేవాలయము ఎంతో పవిత్రమైనదని శ్రీ మహాలక్ష్మి , శ్రీ మహాభిరామచంద్రస్వామి దేవాలయ పుణ్యక్షేత్రాన్ని చూడడానికి విదేశాల నుండి కూడా వస్తున్నారని , ప్రజలందరూ మనశ్శాంతి కోసం ప్రకృతిలో ప్రశాంతంగా ఉన్న దేవాలయం ఇదేనని అనేక గ్రామాల నుండి వస్తున్నారని... నిత్యం దైవ దర్శనం , అర్చనలు ప్రతినెల అమ్మవారికి , పట్టాభి సీతారామచంద్రస్వామి మాస కల్యాణం ప్రతినెల నిర్వహించడం జరుగుతుందని మహాలక్ష్మి అమ్మవారి , పట్టాభి సీతారామచంద్రస్వామి గార్ల ఆశీస్సులు ఎల్లపుడూ ప్రజలు పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు ఉత్తరపల్లి నరసింహచార్యులు , మనీ , యాట వెంకన్న , మదూరి జమున కిషన్ రావు, సామజిక కార్యకర్త వేముల సైదులు , కొనతం కృష్ణారెడ్డి , అవుల సైదులు , జానయ్య , దంతూరి లింగయ్య , చిల్లా సునీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణం కాపాడదాం

● వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య, క్రాంతి హైస్కూల్ శ్రీరాముల నాగేశ్వర్






**తొలిఅక్షరం/నెక్కొండ నవంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చంద్రుగొండ గ్రామంలోని క్రాంతి హై స్కూల్ లో గడ్డల శృతి 9వ,తరగతి విద్యార్థినీ పుట్టినరోజు సందర్భంగా వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య క్రాంతి హై స్కూల్ ఆవరణంలో విద్యార్థిని శృతి తో భౌగుణ పూల మొక్కను నాటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ, మనుగడకు చెట్లే మూలాధారం కాలుష్యం నివారించాలంటే పర్యావరణం పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను పెంచాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి విజయవంతులు కావాలని భగవంతుని వేడుకుని వన ప్రేమికుడు సమ్మయ్య శృతికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు టీచర్లు తదితరులు పాల్గొన్నారు. క్రాంతి హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీరాముల నాగేశ్వర్ మాట్లాడుతూ వన ప్రేమికుడు సమ్మయ్యను అభినందించారు. స్వచ్ఛందంగా ప్రకృతి పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు గాను పాఠశాల, గుడి, తదితర ప్రదేశాలలో మొక్కలు నాటడం పై సంతృప్తిని వ్యక్తపరిచారు. వన ప్రేమికుడు నలగొండ సమ్మయ్యను అభినందించడం జరిగింది.

# జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చిరుమర్తి





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5:** బోరబండ డివిజన్ లోని 314,315,316 బూత్ లలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం సాయంకాలం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన వినాయకరావు నగర్ బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఈ సందర్భంగా కేసీఆర్ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలు, మోసపూరిత హామీలు, అమలుకానీ ఆరు గ్యారంటీలు, రేవంత్ రెడ్డి హైడ్రాతో చేసిన అరాచకాలను కాలనీవాసులకు వివరిస్తూ, బిఆర్ఎస్ అందించిన సంక్షేమ ఫలాల ప్రాముఖ్యతలను వివరిస్తూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆయన కోరారుఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షులు బోక్క .మాధవరెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారులు ఎస్కే చాంద్ పట్టణ అధ్యక్షులు. సాయి అమర్అంజద్ తదితరులు పాల్గొన్నారు

# చిన్నారి జాహ్నవిని ఆశీర్వదించిన (లైవ్ ) అధ్యక్షులు మాలోత్ దేవేందర్ నాయక్ జాదవ్



**తొలిఅక్షరం/నెక్కొండ నవంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కొర్పోల్ గ్రామానికి చెందిన ఇండ్ల స్వాతి -సతీష్ అనిరుద్, మరియు జాహ్నవి ల ను ఆశీర్వదించిన వరంగల్ జిల్లా లంబడా ఐక్యవేదిక( లైవ్) అధ్యక్షులు మాలోతు దేవేందర్ నాయక్ జాదవ్, అదే విధంగా నెక్కొండ మండల తొలి అక్షరం రిపోర్టర్ కొయ్యడ సుధాకర్, తొగరు సంపత్, చిరబోయిన ఏకాంబరం, కొయ్యడరాజు ఇండ్ల, ఏకాంబరం ఆధ్వర్యంలో చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది. అనిరుద్ మరియు జాహ్నవిలా సారి ఫంక్షన్ కి హాజరు కాలేకపోయినందున వారిని సత్కరించి,చిన్న బహుమానాన్ని అందించడం జరిగింది. చిన్నారి జాహ్నవిని మరియు అనిరుద్ కీ శుభ ఆశీస్సులు అందించడం జరిగింది. ఆశీర్వదిస్తూ శుభాఆశీస్సులు అందించడం జరిగింది.

# అడిగిన వెంటనే సీసీ రోడ్డు సాంక్షన్ చేసిన ఎమ్మెల్యేకి ధన్యవాదాలు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని 4వ వార్డులో 40 సంవత్సరాలుగా కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఏ పార్టీ నాయకులు కూడా పట్టించుకోలేదు.సీసీ రోడ్డు అడిగిన వెంటనే సాంక్షన్ చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలుపుతూ.. సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలేరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంఏ ఎజాస్,4వ వార్డ్ మాజీ కౌన్సిలర్ సమంత రెడ్డి,మొరిగాడి రమేష్,కల్వకుంట్ల లోకేష్,కాసుల భాస్కర్,మెరుగు శ్రీధర్,గడ్డమీది సాయినాథ్,మోతే తిరుపతి,బరిగే శ్రీనివాస్,రంజిత్, నరేష్,మహేష్,శివ,గణేష్,మొరిగాడి రాజయ్య,గట్టు శీను, రాజేందర్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భళారే మాస్టర్ భళారే

- న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కోచ్ నంది అవార్డు గ్రహీత మాస్టర్ అహ్మద్ ఖాన్




**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రముఖ కుంగ్ ఫు కోచ్ నంది అవార్డు గ్రహీత మాస్టర్ అహ్మద్ ఖాన్ కు మరో అవార్డు లెజెండరీ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ లైఫ్ టైం లెగసి అవార్డు 9వ తేదీ రోజు శ్రీ సాయి రమ్య ఫంక్షన్ హాల్ దేవరకొండలో జరిగే ఫస్ట్ నేషనల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్2025ప్రదర్శనలో ఈ అవార్డు తీసుకోబోతున్నారు.


# బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి రావాలని అరుణాచలంలో గిరిప్రదక్షిణ

- జిల్లా కాంగ్రెసు నాయకులు కానుకుంట్ల యాదగిరి-నర్మద దంపతులు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబరు 05:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలానికి చెందిన కాంగ్రెసు పార్టీ నాయకులు కానుకుంట్ల యాదగిరి-నర్మద దంపతులు బుధవారం రోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేసి ఆలేరు శాసన సభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకి మంత్రి పదవి రావాలని స్వామివారిని దర్శించుకోని ప్రార్థించడం జరిగిందని అన్నారు.

# ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



**తొలి అక్షరం/దంతాలపల్లి అక్టోబర్5:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ఘనంగా కార్తీక్ పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు ' ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజమున నుంచే శివాలయలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ ముక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు భక్తులకు ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు భక్తులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌ని గెలిపించుకుందాం..

ఎన్నికల ప్రచారంలో షాద్ నగర్ నాయకుల జోరు

ప్రచారంలో మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా

ఎన్నికల ప్రచారానికి ఎండి ఖాదర్ గోరి, సయ్యద్ సాధిక్

కాంగ్రెస్ విజయం లాంచనమే అంటున్న నాయకులు



**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార విషయంలో నగర్ కాంగ్రెస్ నాయకులు జోరు పెంచారు. ఒక్కొక్కరుగా నిత్యం ప్రచారాలలో పాలుపంచుకుంటూ షాద్ నగర్ నియోజకవర్గ సత్తాను జూబ్లీహిల్స్ వరకు తీసుకువెళ్లారు. ఒకవైపు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రచారంలో ప్రతినిత్యం దూసుకుపోతుండగా, మిగతా నాయకులు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో మాది ఎంపీపీ వన్నాడ ప్రకాష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా పాల్గొనగా, మరోవైపు నుంచి మైనారిటీ నాయకులు ఎండీ ఖాదర్ ఘోరి, సయ్యద్ సాదిక్లో పాలుపంచుకున్నారు. ఇంటిరి ప్రచారాన్ని నిర్వహించి ఎన్నికల ప్రచారంలో తమ వంతు పాత్ర పోషించారు.

**కాంగ్రెస్ ఘనవిజయం ఖాయం..** ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఉన్నాడా ప్రకాష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాష మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి భారీ స్పందన వస్తుందని పేర్కొన్నారు. ఎండి ఖాదర్ ఘోరి మాట్లాడుతు జూబ్లీహిల్స్ ప్రాంతం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అక్కడ అభివృద్ధి జరుగుతుందని ఈ సందర్భంగా అన్నారు. మాజీ కౌన్సిలర్ సర్వర్ భాష మాట్లాడుతూ ఏజెంట్ ప్రచారానికి అక్కడి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, ఇది కాంగ్రెస్ ఘన విజయానికి సంకేతం అని అన్నారు. సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ రాజధాని నగరంలో ఈ విడత కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నం

- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- తొర్రూర్ సబ్ ఇన్స్పెక్టర్ గొల్లమూడి ఉపేందర్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో,తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం), నవంబర్5 :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో సమాజం తలదించుకునే అత్యంత దారుణమైన సంఘటన చోటు చేసుకుంది.ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం చేసిన ఘటన స్థానికులను తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురి చేసింది. తొర్రూర్ సబ్ ఇన్స్పెక్టర్ గొల్లమూడి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన ఆరేళ్ల బాలికపై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వెంటనే నిందితుడి ఇంటికి వెళ్లి ప్రశ్నించారు.నిందితుడి తల్లి, తండ్రి, నానమ్మ కలిసి కోపోద్రిక్తులై, బాధితురాలి తండ్రిపైనే దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ దాడితో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తొర్రూర్ సబ్ ఇన్స్పెక్టర్ గొల్లమూడి ఉపేందర్ తెలిపారు.ఈ ఘటనపై మరింత లోతైన దర్యాప్తు ప్రారంభిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ సంఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హాస్టల్లో నాణ్యమైన భోజనమును అందించాలి

**తొలి అక్షరం/దంతాలపల్లి అక్టోబర్ 5:** మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆమె సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా విద్యార్థులకు వేడి చేసిన నీటిని చల్లార్చిన తర్వాత అందించాలని వాడ వార్డెన్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్ వెంకన్న పాల్గొన్నారు

## సిఏ పరీక్షలో రోహిత్ విజయకేతనం



**తొలిఅక్షరం/నెక్కొండ నవంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన యువకుడు భూపతి రోహిత్ చార్టర్డ్ అకౌంటెన్సీ (సిఏ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి కుటుంబానికి, గ్రామానికి గౌరవం తెచ్చిపెట్టాడు.రోహిత్, ఎల్ఐసి ఏజెంట్గా పనిచేస్తున్న భూపతి వీరన్న, కుమారుడు. సాధారణ కుటుంబానికి చెందిన రోహిత్ కష్టపడి, పట్టుదలతో ఈ ప్రతిష్టాత్మకమైన సిఏ పరీక్షను పూర్తి చేశారు.ఈ విజయాన్ని పురస్కరించుకొని నెక్కొండ మండలంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు, మండల ప్రజలు, రైతులు రోహిత్ను అభినందించారు. కష్టజీవుల కుటుంబం నుంచి సిఏ స్థాయికి ఎదిగిన రోహిత్ యువతకు ఆదర్శమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## త్రిశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

**తొలి అక్షరం :వలిగొండ, నవంబర్, 05:** ఈరోజు ఉదయం నుండి కార్తీక పౌర్ణమి సందర్భంగా వలిగొండ లోని త్రిశక్తి ఆలయానికి , భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, వ్రతాలు, చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్, ఏర్పాట్లు చేశారు.



# దేదీప్యమానం కోట గుళ్ళ దీపోత్సవం

- శివ నామస్మరణతో మార్మోగిన గణపేశ్వరాలయం
- ఉదయం నుండి కొనసాగిన భక్తుల రద్దీ
- స్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం
- ఉసిరి మామిడి చెట్ల వద్ద దీపాలు వెలిగించిన మహిళలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం
- పలువురు ప్రముఖుల ప్రత్యేక పూజలు







**తొలి అక్షరం/గణపురం/05:** కార్తీక పౌర్ణమి పర్వదినాన దీపోత్సవంతో కోట గుళ్ళు దేదీప్యమానంగా భక్తులకు దర్శమిచ్చాయి. గణపేశ్వరాలయం కోట గుళ్ళు వేయి వెలుగుల కాంతులతో భక్తుల్లో భక్తి భావం నింపాయి మండల కేం ద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి దీపో త్సవం సందర్భంగా ఉదయం అర్చకులు గంగాధర్ , జూలపల్లి నాగరాజు లు మొదట గణపతి పూజ నిర్వహించారు. తెల్లవారుజామున కార్తిక దీపాలను వెలిగించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తుల ధరలు వచ్చి స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని పురస్క రించుకొని 21వేల దీపాలను వెలిగించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయం ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలోని ఉసిరి, మేడి, జమ్మి, మారేడు వృక్షాల వద్ద దీపాలు వెలిగించి ప్రసాదాలు సమర్పించారు. సాయంకాల సమయంలో 6 గంటలకు ఆలయంలో ఏర్పాటుచేసిన 21 వేల దీపాల ను వెలిగించి పాఠశాలల విద్యార్థినీలు, మ హిళల సహకారంతో దీపోత్సవ కార్యక్ర మాన్ని పరిరక్షణ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన 21 వేలదీపాలు వెలిగించడంతో ఆలయ ప్రాంగణం మొత్తం దీపాల కాంతులతో విరాజిల్లింది.

**ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖులు.**

గణపేశ్వరాలయం కోటగుళ్లలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతులు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు అనంతరం మహిళలకు వాయినాలు సమర్పించారు. భూపాలపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ గౌడ్ ఎస్ఐ రేఖ అశోక్ లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. . దీపోత్సవ కార్యక్రమం సుమారు 5 గంటల పాటు కొనసాగింది.

# మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 5:** మొంథా తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం తక్షణమే స్పందించి అధికారులను క్షేత్ర స్థాయిలో పర్యటింపజేసి రైతులను పరామర్శించి రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి కోరారు.ఈరోజు తొర్రూరు మండలం లోని అమ్మాపురం గ్రామంలో మొంథా తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లిన పంట పొలాల్లో పర్యటించి పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం పాలకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా రైతాంగాన్ని నిండా ముంచింది అని,ఆరుగాలం కష్టించి రాత్రనక పగలనక పండించిన పంట తీరా చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు రైతులను దారుణంగా దెబ్బ తీశాయని,మొంథా తుఫాన్ వల్ల రైతులు అన్ని విధాలా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు పదివేల రూపాయలు నష్టపరిహారం ప్రకటించడం సరికాదని అవి రైతులకు ఏమూలకూ సరిపోవని, జరిగిన నష్టం చాలా పెద్దదని ఎకరాకు యాభై వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.పాలకుర్తి నియోజకవర్గంలో రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో బిజీబిజీగా ఉంది అని,ఇది చాలా దుర్మార్గం అని నమ్మి ఓట్లేసిన రైతులను నట్టేట ముంచిన ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి కి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి రైతాంగం సిద్దం గా ఉన్నారని ఆయన తెలిపారు.మొంథా తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని బీజేపీ రాష్ట్ర నాయకత్వం మరియు కేంద్ర మంత్రి వర్యులు కిషన్ రెడ్డి మరియు బండి సంజయ్ గారల సహాయం తో ప్రధాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జాతీయ విపత్తుగా భావించి రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.రాబోయే రోజుల్లో పాలకుర్తి నియోజకవర్గ ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకొంటూ ప్రజల పక్షాన నిలబడి పోరుబాట పడుతామని, ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, తొర్రూరు రూరల్ మండలం అద్యక్షుడు గట్టు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, జిల్లా మాజీ కార్యదర్శి,మాజీ కౌన్సిలర్ కొలుపుల శంకర్, అలిసేరి రవిబాబు, బొచ్చు సురేష్, కట్టోజు భాస్కరా చారి,దేవరకొండ విష్ణు,రాయపురం రాజ కుమార్, గడల శేఖర్,పప్పుశెట్టి సంతోష్,కొండ యాకన్న, గుగులోత్ భాస్కర్ నాయక్,ధరావత్ శ్రీనివాస్,సిహెచ్.విజయ్ కుమార్, గుండా సురేష్,గట్ల భరత్, నూకల నవీన్, శీలం శ్రీనాథ్,ఛలపతి రాజ్,సిరిపాటి విశాల్, కిన్నెర రాజ్ కుమార్, శివ గణేష్, చలువాది సత్యనారాయణ,తాటి జగదీష్,ధరావత్ తేజస్, సిహెచ్.శ్రీనివాస్, అశోక్ , సురేష్ నాయక్ ,గంధం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఊపందుకున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం

- నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా యశస్విని ఝాన్సీ రెడ్డిల ఇంటింటా ప్రచారం



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో,తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),నవంబర్5:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో భాగంగాఎన్నికల ప్రచారం ఊపందుకుంది.నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించగా టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి యూసఫ్ గూడా డివిజన్ పరిధిలో డోర్ టు డోర్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఝాన్సీ ల,యశస్విని రెడ్డిలు మాట్లాడుతూ.....ప్రజలంతా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నవీన్ యాదవ్ ని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్ యాదవ్ తోనే సాధ్యమని అన్నారు.



# ఎలాంటి శరతులు లేకుండా సీసీఐ పత్తి కొనుగోలు చేయాలి

- ఎకరాకు 7క్వింటలు మాత్రమే కొనుగోలు చేస్తామనడం రైతులకు అన్యాయం చేయడమే
- 20శాతం తేమ ఉన్న పత్తి కొనుగోలు చేయాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి



**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5:**పత్తి రైతుల వద్ద ఎకరాకు 7క్వింటల్ మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన ఎత్తివేసి, 20శాతం తేమ ఉన్నా షరతులు విధించకుండా పత్తిని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిపురం గ్రామంలో సిపిఎం-రైతు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కురుస్తున్న తుఫాను మూలంగా నష్టపోయిన పత్తి పంటను పరిశీలించి, రైతులతో సమస్యలు అడిగి తెలుసుకొని అనంతరం మాట్లాడుతూ అప్పులు చేసి పెట్టుబడి పెట్టి చేత్తికొచ్చే సమయానికే వర్షాలు నిండా ముంచాయని ఇదిలా ఉంటే ఎకరాకు కేవలం 7క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం షరతులు పెట్టడంతో కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు శాంకేతిక అవగాహన లేక ముందస్తుగా నమోదు చేసుకోలేక పోవడంతో పత్తిని సీసీఐ కేంద్రాలు కొనుగోలు చేయడం లేదని అన్నారు. కొనక పోవడంతో నాలుగు వేల ధరకు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుందన్నారు.కపాస్ కిసాన్ యాప్ తో కాకుండా టోకెన్ విధానంతో వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి శరతులు లేకుండా ఎకరానికి 12 క్వింటాళ్ళు కొనుగోలు చేయాలని అన్నారు. తెమశాతం 20శాతం ఉన్నా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం పత్తి పంటపై విదేశీ సుంకం 11శాతం కు తగ్గించాలని చూస్తుందని అలా అయితే మద్దతు ధర తగ్గుతుందని రైతులకు నష్టం జరుగుతుందన్నారు.అధిక వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులకు ప్రభుత్వం ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి సురేందర్ రెడ్డి,కునూరు వెంకటేశం,దాడి మల్లారెడ్డి, సుభాష్ రెడ్డి, పల్లె సత్యం, కునూరు గణేష్,మల్లేష్, మార్త భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ నవీన్ రెడ్డి

**● జూబ్లీహిల్స్ డివిజన్ ఎల్లారెడ్డి గూడలో కేటీఆర్ రోడ్ షో, కార్నర్ మీటింగ్ కు విశేష స్పందన ● జనసంద్రంతో కిక్కిరిసిన ఎల్లారెడ్డి గూడ కాలనీ ● ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై కేటీఆర్ ప్రశంశ జల్లులు**




**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05:** నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల చూపు ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పైనే ఉందని నైతికంగా బిఆర్ఎస్ గెలుపు ఖాయమైందని మెజార్టీ ఓట్ల కొరకే ఈ ఎన్నికలు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఎల్లారెడ్డి గూడ లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అధ్యర్యంలో జరిగిన రోడ్ షో, కార్నర్ మీటింగ్ కు కేటీఆర్, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతమ్మ పాల్గొన్నారు. ఈ కార్నర్ మీటింగ్ లో ఎల్లారెడ్డి గూడ జనసంద్రం తో గులాబీమయం అయింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈ ఉపఎన్నిక లో జూబ్లీహిల్స్ ప్రజలు బిఆర్ఎస్ కె పట్టం కట్టానున్నారని ప్రజల మద్దతు బిఆర్ఎస్ పార్టీ కే ఉందని తెలిపారు. ఇచ్చిన హామీలను మరిచిన రేవంత్ రెడ్డి ఎం మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తున్నావని అన్నారు. ప్రజలు కెసిఆరే మళ్ళీ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్నర్ మీటింగ్ లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుస్తున్నాం

**షాద్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్**

**ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది**

**కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో జూబ్లీహిల్స్ ప్రజలు లేరు**

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఇంటింటి ప్రచారం**

**నిర్వహించిన సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్, పార్టీ శ్రేణులు**




**తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 05:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ ఖచ్చితంగా గెలుస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నేత వై. రవీందర్ యాదవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం రహమత్ నగర్ డివిజన్ లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ప్రచారంలో ఓటర్ల నుంచి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని, కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించే పరిస్థితిలో లేరని తెలిపారు. గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం కొనసాగుతుందని, ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న ఫలితం లేకుండా పోతుందని, స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ మాగంటి సునీతమ్మను భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక బూత్ ఇంఛార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్తీక పౌర్ణమి సందర్భంగా సీతారాంపురం మహిళల ప్రత్యేక పూజలు

**- పాలకుర్తి శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానంలో దీపారాధన**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 5:** నెల్లికుదురు మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన భక్త మహిళలు బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పాలకుర్తి శ్ర సోమేశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి దీపారాధన, అభిషేకం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని భక్తి పరవశులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ – "అందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా జీవించాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని మనసారా స్వామి వారిని ప్రార్థించాం. కార్తీక మాసం ఆధ్యాత్మికతతో నిండిన పవిత్రమైన కాలం" అని పేర్కొన్నారు.



# నరసింహులపేటలో మహా కార్తీక పౌర్ణమి దీపకాంతులు శుభ్రతకు ఆదర్శం అందించిన రిపోర్టర్ శ్రీనివాస్ సేవ



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్ 5:** నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరి నవగ్రహ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది పవిత్ర కార్తీక పౌర్ణమి పర్వదినాన ఆలయ ప్రాంగణం భక్త జనసంద్రమైంది వేలాది దీపాలతో పరమశివుని సన్నిధి దేదీప్యమానంగా దర్శనమిచ్చింది ఈ వేడుకల్లో భాగంగా స్థానిక రిపోర్టర్ సిఎస్ శ్రీనివాస్ ప్రత్యేకంగా ఆలయాన్ని సందర్శించారు ఆయన శివుని అనుగ్రహంతో దీపారాధన కొబ్బరికాయలు సమర్పించి పండుగ పూజలు నిర్వహించారు తన భక్తిని పూజలకే పరిమితం చేయకుండా నిజమైన సేవకు నడుం బిగించారుకార్తీక పౌర్ణమి పూజలు ముగిసిన వెంటనే రిపోర్టర్ శ్రీనివాస్ ఆలయాన్ని శుద్ధి చేసే కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు భక్తులు వదిలివేసిన పూజా సామాగ్రి కొబ్బరి పెంకులు దీపారాధన శేషాలతో నిండిన ప్రాంగణాన్ని శుభ్రం చేయడానికి ముందుకు వచ్చారు తెల్లని చుక్కల షర్టు ధరించి కొంచెం కూడా సంకోచం లేకుండా నేల మీద పడి ఉన్న ప్రతి వ్యర్థాన్ని తన చేతులతో ఏరి సంచుల్లో నింపారు ఆలయ పరిశుభ్రతే నిజమైన దైవ సేవ అని చాటి చెప్పారు ఆయనతో పాటు కొందరు స్థానికులు యువకులు కూడా ఈ శుభ్రత పాలుపంచుకున్నారు ఒక మీడియా ప్రతినిధి దైవభక్తితో పాటు సామాజిక బాధ్యతను ప్రదర్శిస్తూ ఆలయ శుద్ధిని చేపట్టడం నర్సింహులపేట ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తిని ఇచ్చింది శ్రీనివాస్ చేసిన ఈ ఆదర్శప్రాయమైన సేవ ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఆయన అంకితభావాన్ని చాటింది ఇది ఆధ్యాత్మికత పరిశుభ్రత కలగలిసిన ఒక అద్భుతమైన దైవ సేవగా నిలిచింది

# ఇనుగుర్తి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి: సత్యనారాయణ వ్రతం, అన్నదానం




**తొలి అక్షరం/ఇనుగుర్తి నవంబర్ 5:** ఇనుగుర్తి మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో విశేష కార్యక్రమాలను నిర్వహించారు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకరణలు జరిగాయి భక్తులు అధిక సంఖ్యలో అందులో మహిళలు మరింత ఎక్కువగా పాల్గొని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు లోక కల్యాణం కోసం భక్తులు భక్తిపారవశ్యంతో వ్రతంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి యొక్క ప్రాముఖ్యతను వివరించారు భక్తులు ధర్మాన్ని పాటించి అన్నదానాలు వంటి పుణ్యకార్యాలు చేయాలని సూచించారు అనంతరం వజనపల్లి శ్రీధర్ కవిత దంపతులు భక్తుల కోసం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ పవిత్ర దినాన అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# నెల్లికుదురులో కాంగ్రెస్ ఏదల్ల యాదవ రెడ్డి జన్మదిన వేడుకలు

**పార్తమ్మ గూడెం అభిమాన సైన్యం మధ్య కేక్ కట్ చేసిన జననేత**

**యూత్ ప్రభుత్వ హాస్పిటల్లో పండ్ల పంపిణీతో సేవా యజ్ఞం**

**ప్రతి కార్యకర్త నా బలం- లక్ష్య సాధనలో తగ్గేదేలేదని సింహగర్జన**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ నవంబర్5:** నెల్లికుదురు మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ ఏదల్ల యాదవ రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక పార్తమ్మ గూడెంలోని ఆయన స్వగృహంలో అపూర్వ రీతిలో జరిగింది ఇది కేవలం జన్మదినం కాదు రానున్న ఎన్నికలకు శంఖారావం అనేలా ఉత్తేజాన్ని నింపింది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాల ప్రతినిధులు యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు యాదవ రెడ్డి నివాసం వైపుగా వచ్చే దారులన్నీ జై కాంగ్రెస్ నినాదాలతో మారుమోగాయి పార్టీ శ్రేణుల కరతాళ ధ్వనుల మధ్య ఉద్వేగభరిత వాతావరణంలో ఏదల్ల యాదవ రెడ్డి కేక్ కట్ చేశారు కార్యకర్తలు పోటీ పడి ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి తమ అంతరంగాన్ని చాటుకున్నారు యాదవ రెడ్డి ఆశీస్సులతో కాంగ్రెస్ యూత్ నాయకులు పెరుమాళ్ళ జగన్ బాబు ఆయన సహచర యువకులు ముందుగా నెల్లికుదురు ప్రభుత్వ హాస్పిటల్ చేరుకున్నారు అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి యాదవ రెడ్డి ఆశయాలకు అద్దం పట్టారు నాయకులు మాట్లాడుతూ ఏదల్ల యాదవ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఒక ధృవతార వంటి వారని ఆయన నాయకత్వం యువతకు దిక్సూచి అని కొనియాడారు ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు నాకున్న అత్యంత విలువైన ఆస్తి అన్నారు మీ అందరి అభిమానం నాకు వేయి ఏనుగుల బలం అన్నారు మన పార్టీ సిద్ధాంతాలను లక్ష్యాలను ప్రజ ల్లోకి బలంగా తీసుకువెళ్లాలి అన్నారు రాబోయే రోజుల్లో విజయ దుందుభి మోగించడమే మనముం దున్న ఏకైక కర్తవ్యం అని సింహగర్జన చేశారు కార్యకర్తలు అంతా ఒక్క తాటిపై నడిచి పార్టీ బలోపేతా నికి శ్రమించాలని పిలుపునిచ్చారు ఈ వేడుక నెల్లికుదురు కాంగ్రెస్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది




# అకాల వర్షానికి ఆగమైన పత్తి రైతులు

**తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం చూడాలి**

**బొడ్డుపల్లీ. శోభ మహిళ రైతు**





**తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 5:** ఇటీవల కురిసిన మొంథా వర్షాల వల్ల ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి చేతికి రాక నష్టాల ఊబిలో రైతులు అల్లాడిపోతున్నారని భోగారం గ్రామానికి చెందిన మహిళ రైతు బొడ్డుపల్లి శోభ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి నిబంధనలు షరతులు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేయాలని,ఎకరాకు 7 క్వింటాలు కొనుగోలు చేస్తామనే నిబంధన, తేమశాతం 8 నుండి 12శాతం వరకు మాత్రమే దిగుబడి చేసుకుంటామని పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు చెబుతున్నారని, అంతేకాకుండా ట్రాక్టర్లతో తీసుకువెళ్లిన పత్తి తిరిగి పంపించడంవల్ల కిరాయిలు కూడా మీద బడి నానాతండాలు పడుతున్నామని అన్నారు. రెవెన్యూ శాఖ వారు వీఆర్ఏలను పంపి గ్రామాలలో పత్తిని పరిశీలించి రైతులకు దిగుబడి ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని రుద్రాభిషేకాలు



**తొలి అక్షరం/నెక్కొండ నెంబర్ 5:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని, భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కార్తీక పౌర్ణమి పరమశివుడికి ప్రీతికరం కావడంతో భక్తులు పంచామృతాలతో అభిషేకం చేశారు . ఆలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. శివార్చనలు ,బిల్వార్చనలు సాగాయి. శివనామస్మరణతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. శ్రీ సీతారామచంద్ర స్వామి,భవాని పార్వతి పరమేశ్వరులను ,వాసవి అమ్మవారు, గణపతి నాగేంద్ర సుబ్రహ్మణ్య స్వామివారలనుభక్తిశ్రద్ధలతో కొలిచి మొక్కులు చెల్లించుకున్నారు.

# జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రచారంలో సుడా చైర్మన్

**తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్5:** హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా కరీంనగర్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి 97 వ డివిజన్ లోని ఎల్లారెడ్డి గూడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.సుడా చైర్మన్ తో కలిసి ప్రచారంలో సిటీ కాంగ్రెస్ నాయకులు కొట్టె ప్రభాకర్,కీర్తి కుమార్,ఉప్పరి అజయ్,బాలకృష్ణ తదితరులు పాల్గొంటున్నారు.

# గర్ల్‌ఫ్రెండ్ మూవీ సంతృప్తిని ఇచ్చే సినిమా

## నిర్మాత అల్లు అరవింద్ కామెంట్స్



రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో రూపొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఈనెల 7న విడుదల కానుంది. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రం ట్రైలర్ నుంచి మంచి హైప్ క్రియేట్ చేయడంతో సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో తాజాగా బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. అల్లు అరవింద్ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. నేను చాలా సినిమాలు తీశాను, డబ్బులు సంపాదించాను. కానీ 'ది గర్ల్‌ఫ్రెండ్' మాత్రం తృప్తికోసం తీశాను అంటూ వ్యాఖ్యానించారు. 2021లో ఈ కథ విన్నప్పటి నుంచి సినిమా తీయాలని ఎదురుచూశాను. సమాజానికి బోల్డ్‌గా కొన్ని విషయాలు చెప్పాలనిపించింది. అందుకే ఈ సినిమా చేశాము. ఇది చాలా సున్నితమైన సబ్జెక్ట్. ప్రతి యువకుడు, యువతి తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదని అన్నారు. ఇందులో ఎన్ని పాటలు ఉన్నాయి, ఎన్ని ÷టింగ్‌లు ఉన్నాయి, ఏం పంచ్‌లు ఉన్నాయనేది ఈ సినిమాకు వర్తించదని, 'మన ఇంట్లో ఆడవాళ్ల మనస్సుల్లో ఏమి కోరికలు, భావోద్వేగాలు ఉంటాయో ఈ సినిమా చూపిస్తుంది. కథ అతి సున్నితంగా మొదలై, అతి ఘాటుగా ముగుస్తుంది. చూసిన వారు ఈ సినిమాను మర్చిపోలేరు? ఈ కథ వెంటాడుతుంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' కి తక్కువ రేటింగ్ ఇవ్వలేరు అంత సంతృప్తికరంగా ఉంటుంది సినిమా అని స్పష్టం చేశారు. ప్రస్తుతం అల్లు అరవింద్ కూడా ముందుకు వచ్చి చెప్పిన ఈ మాటలు ఇప్పుడు సినిమాపై మరింత బజ్ తీసుకొచ్చేలా ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఓ విలేఖరి ఇటీవల బండ్ల గణెళిష్ చేసిన కామెంట్స్ గురించి మాట్లాడాలి అని అడగగా.. నేను ఆయన గురించి మాట్లాడను నాకంటూ ఓ స్థాయి ఉంది అంటూ కౌంటర్ ఇచ్చారు.


## నా మాటలు బాధపెడితే క్షమించండి: బండ్ల గణేశ్



నిర్మాత బండ్ల గణేశ్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు తెలిపారు. ఇటీవల 'కె రాంప్' సినిమా సక్సెస్ మీట్‌లో తాను చేసిన ప్రసంగం కొంత వివాదాస్పదం కావడంతో ఆయన స్పందించారు. తన మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ విషయంపై బండ్ల గణేశ్ స్పందిస్తూ, "ఇటీవల 'కె రాంప్' సినిమా సక్సెస్ మీట్‌లో నేను మాట్లాడిన మాటలు కొందరిని బాధపెట్టాయని తెలిసింది. నేను ఎవరినీ ఉద్దేశించి మాట్లాడలేదు. నా ఉద్దేశం అందరూ బాగుండాలి, కళామాత ఆశీస్సులతో అందరం పైకి రావాలని మాత్రమే" అని వివరణ ఇచ్చారు.తన మాటల వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పరిశ్రమలో అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆకాంక్షించారు.


ఈ క్రమంలో ఎవరైనా తన వ్యాఖ్యల వల్ల నొచ్చుకుని ఉంటే క్షమించాలని కోరారు. "ఎవరైనా బాధపడి ఉంటే క్షమాపణలు" అని తన ప్రకటనలో పేర్కొన్నారు. బండ్ల గణేశ్ క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం ముగిసినట్టేనని పలువురు భావిస్తున్నారు. 'కె రాంప్' కార్యక్రమంలో బండ్ల గణేశ్ మాట్లాడుతూ, "ఒకప్పుడు నా దగ్గర సినిమాల్లో అవకాశాలు అడిగిన వాళ్లు ఇప్పుడు పెద్ద హీరోలయ్యారు" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడిన తీరు, సందర్భాన్ని బట్టి ఆ వ్యాఖ్యలు యువ హీరో విజయ్ దేవరకొండను ఉద్దేశించినవేనని పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. సోషల్ మీడియాలోనూ దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో ఈ విషయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఆయన తాజాగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.



# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు

రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహామాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఓక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహామాన్ నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యూవేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్క సారిగా పాటపై హైప్ పెంచేశారు.ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేపింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శణమివడం గ్యారంటీ.

# అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్





మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.

# కె ర్యాంప్ పాపకి వర్క్ అవుట్ అయినట్టేనా..?



కిరణ్ అబ్బవరం కె ర్యాంప్ లో హీరోయిన్ గా నటించిన బ్యూటీ యుక్తి తరేజా. చాలామంది ఆమెకు ఇది తొలి తెలుగు సినిమా అనుకున్నారు కానీ యుక్తి ఆల్రెడీ 2023లోనే టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. యువ హీరో నాగ శౌర్యతో రంగబలి సినిమా తీసిన ఈ అమ్మడు ఆ సినిమాలో ఆకట్టుకుంది. ఐతే సినిమా కమర్షియల్ సక్సెస్ అవ్వలేదు కాబట్టి ఆమెను పట్టించుకోలేదు. ఇక కన్నడ మార్కో సినిమాలో హీరోయిన్ గా చేసి సక్సెస్ అందుకుంది అమ్మడు. కె ర్యాంప్ తో కిరణ్ అబ్బవరం తో జత కట్టింది. సినిమాలో అమ్మడి పర్ఫార్మెన్స్, గ్లామర్ అంతా కూడా తెలుగు ఆడియన్స్ కి నచ్చేసింది. కె ర్యాంప్ తో కమర్షియల్ గా సక్సెస్ అందుకుంది యుక్తి తరేజా. సో అమ్మడికి కచ్చితంగా మంచి ఛాన్స్ వచ్చేస్తాయని చెప్పొచ్చు. కె ర్యాంప్ తర్వాత యుక్తి ఆల్రెడీ కింగ్ జాకీ క్వీన్ అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో దసరా దీక్షిత్ శెట్టి హీరోగా చేస్తున్నాడు. కె ర్యాంప్ తో ఆడియన్స్ లో ఒక ఐడెంటిటీ తెచ్చుకుంది కాబట్టి యుక్తికి ఇక్కడ మంచి స్కోప్ దొరికినట్టే లెక్క. ఐతే 2023 తర్వాత సినిమా ఆఫర్లు రాలేదా తనే స్కిప్ చేసిందా తెలియదు కానీ కె ర్యాంప్ లో ఆమెను చూసి తెలుగు తెరకు మరో టాలెంటెడ్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చిందని అంటున్నారు. సినిమాలు తక్కువ చేస్తున్నా యుక్తి ఫోటో షూట్స్ తో మాత్రం రచ్చ రంబోలా అనిపిస్తుంది. గ్లామర్ షోతో అమ్మడు చేసే ఫోటో షూట్స్ ఐతే సోషల్ మీడియాని షేక్ చేస్తాయి. సినిమాల్లోకి రాకముందు మోడల్ గా చేసిన అనుభవం ఉన్న యుక్తి ఇప్పటికీ కొన్ని యాడ్స్ లో కనిపిస్తుంది. యుక్తి తరేజా ఫోటో షూట్స్.. సోషల్ మీడియాని షేక్.. కె ర్యాంప్ హిట్ తర్వాత యుక్తి తెలుగు కెరీర్ గాడిన పడుతుందా లేదా అన్నది చూడాలి. కె ర్యాంప్ సక్సెస్ తో కిరణ్ అబ్బవరం అయితే సూపర్ హ్యాపీగా ఉన్నాడు. క తర్వాత దిల్ రూబా షాక్ ఇచ్చినా మళ్లీ కె ర్యాంప్ తో హిట్ అందుకున్నాడు కిరణ్. సో సినిమా హిట్ అయ్యింది కాబట్టి యుక్తి గురించి కూడా డిస్కషన్స్ చేస్తున్నారు. తెలుగులో రెండు సినిమాలు చేసిన యుక్తి అందులో మొదటిది ఆకట్టుకోలేకపోయినా రెండో సినిమా సక్సెస్ అయ్యింది. సో యుక్తికి కచ్చితంగా తెలుగులో మంచి అవకాశాలే వచ్చే స్కోప్ ఉందని చెప్పొచ్చు. యుక్తి కూడా పాన్ ఇండియా లెవెల్ లో సత్తా చాటుతున్న టాలీవుడ్ లోనే తన ఫ్యూచర్ ని డిసైడ్ అయ్యి మరీ ఇక్కడ సినిమాలు చేయాలని చూస్తుంది. కె ర్యాంప్ తో పాటు కన్నడ సినిమా ఒకటి, తెలుగు సినిమా ఒకటి చేస్తున్న అమ్మడు నెక్స్ట్ ఎలాంటి ప్రాజెక్ట్ తో సర్ ప్రైజ్ చేస్తుందో చూడాలి.

## బోర్డర్-2 నుంచి వరుణ్ ధావన్ లుక్ విడుదల



వరుస సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బోర్డర్ 2. ఈ సినిమాకు సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్ కుమార్ ?, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, దిలిజిత్ దోసాంజే, అహాన్ శెట్టి, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి చిత్రబృందం తాజాగా వరుణ్ ధావన్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. వరుణ్ ధావన్ ఇందులో హోషియర్ సింగ్ దాహియా అనే పాత్రలో కనిపించబోతుండగా ఈ ఫస్ట్ లుక్‌లో వరుణ్ ధావన్ గన్ పట్టుకుని శత్రువులను కాల్చుతున్నట్లు కనిపిస్తుంది.

-----------

## మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ లాల్ మూవీ డిఎస్ ఈరే



మలయాళ స్టార్ నటుడు మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ లాల్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న తాజా చిత్రం 'డీయస్ ఈరే'. ఈ సినిమాకు బ్రహ్మయుగం దర్శకుడు రాహుల్ సదశివన్ దర్శకత్వం వహించగా మలయాళంలో ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తెలుగులో నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది.